# మహిళల భద్రతపై పోలీసుల అవగాహన సదస్సు

### శక్తి యాప్,డయల్-112, సైబర్ నేరాలపై అవగాహన

### సీఐ టి.నరసింహులు






**వేంపల్లె,జూలై05.అక్షర టైమ్స్:-** మహిళలు, బాలికలు భయరహిత వాతావరణంలో జీవించేందుకు ప్రభుత్వం, పోలీసు శాఖ అమలు చేస్తున్న భద్రతా చర్యలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సీ.ఐ.టి. నరసింహులు సూచించారు. ఆదివారం స్థానిక పులివెందుల రోడ్డులోని ఎంఏహెచ్ ఫంక్షన్ హాల్‌లో విద్యార్థినులు, మహిళా సంఘాల సభ్యుల కోసం మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ నరసింహులు మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం అందుబాటులో ఉన్న శక్తి యాప్, అత్యవసర పరిస్థితుల్లో పోలీసు సహాయం కోసం డయల్-112 వినియోగ విధానాన్ని వివరించారు. అలాగే మహిళలపై వేధింపులు, బాల్య వివాహాల నివారణ, గృహహింస, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, మహిళల రక్షణకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలు, విద్యార్థినులు ఎలాంటి సమస్యలు ఎదురైనా భయపడకుండా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని, వారి ఫిర్యాదులను గోప్యంగా స్వీకరించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మహిళల భద్రతకు పోలీసులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని, సమాజంలో ప్రతి ఒక్కరూ మహిళల గౌరవాన్ని కాపాడేందుకు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు తిరుపాల్ నాయక్, తాహీర్ హుస్సేన్, పోలీస్ సిబ్బంది, ఏపిఏం వెంకటేశ్వర రావు, బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుష్మ, డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.



www.akshratimes.com

తెలుగు దినపత్రిక

అక్షర టైమ్స్

మా అక్షరం ప్రజల పక్షం

కర్నూలు, నంద్యాల జిల్లా

వైయస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లా

# ఎమ్మెల్యే సారు పేదలకు భూములు ఎప్పుడు పంచుతారు

### సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ

### సభ్యులు జి.శివకుమార్ సూటి ప్రశ్న

### గోల్డెన్ సర్వే పూర్తి కావడానికి ఎన్ని సంవత్సరాల టైం కావాలి

### ఆలస్యం చేస్తే చెలరేగి పోతున్న ఆక్రమణ దారులతో పేదలకు

### ఎకరా భూమికుడ దక్కే అవకాశం లేదు

### ఎమ్మెల్యే వాగ్దానం పత్రికలకే పరిమితం అయ్యే అవకాశం

### ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ గారికి ఉత్తరం రాసిన సిపిఎం




**బ్రహ్మంగారిమఠం,జూలై05.అక్షర టైమ్స్:-** బ్రహ్మంగారి మఠం మండలంలోని పేదలకు భూములు ఎప్పుడు పంచుతారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.శివకుమార్ ఎమ్మెల్యే ని ప్రశ్నించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.శివకుమార్ మండలకార్యదర్శి గండి సునీల్ కుమార్ తో కలసి ఆదివారం నాడు సుందరయ్య భవన్లో విలేకరుల సమక్షంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కి భూ సమస్యల మీద రాసిన ఉత్తరాన్ని విడుదల చేశారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే దాదాపు 8 నెలల క్రితం మీడియా సమావేశం పెట్టి బ్రహ్మంగారిమఠం మండలంలో దాదాపు 8,వేల ఎకరాలు ప్రభుత్వ భూములు. అసైన్డ్ భూములు ఆక్రమణలకు గురయ్యాయని ఆక్రమణ చేసిన వారిలో తమ పార్టీ వారు కూడా ఉన్నారని అటువంటి భూములన్నీ తిరిగి ప్రభుత్వానికి ఇచ్చేయాలని తెలియజేస్తూ ఆక్రమించిన వారి వివరాలు బయట పెట్టడం జరిగిందని అదే సందర్భంలో రెవెన్యూ అధికారులతో గోల్డెన్ సర్వే పేరుతొ బృందాలను ఏర్పాటుచేసి సర్వేలో ప్రతి ఎకరాను పరిశీలించి భూముల లిస్టు తయారుచేసి మండలంలోని అర్హులైన పేదలందరికీ ప్రత్యేక అసైన్డ్ మెంట్ కమిటీ ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి చేతులు మీదుగా భూ పంపిణీ చేస్తానని మీడియా ముఖంగా తెలియజేసి ఎనిమిది నెలలవుతుందని వారు గుర్తు చేశారు. ఎమ్మెల్యే ప్రకటన తర్వాత సిపిఎం పార్టీ ఎమ్మెల్యే నిర్ణయాన్ని స్వాగతించిందని అభినందించిందని వారు గుర్తు చేశారు, ఇన్ని నెలల కాలంలో గోల్డెన్ సర్వే ఏమి చేసిందో ఎవరికీ అంతు పట్టడం లేదని ఎంత ప్రభుత్వ భూమి కాళీ ఉంది, ఎన్ని ఎకరాల మీద నకిలీ రికార్డులు సృష్టించబడ్డాయి, ఎన్ని ఎకరాలు ఆ క్రమణలో ఉంది అన్నది ఇంతవరకు బహిర్గతం చేయలేదని అలాంటప్పుడు ఈ ఆర్భాటం ఎందుకని వారు ప్రశ్నించారు.మరోపక్క ఎమ్మెల్యే మీడియా సమావేశం పెట్టినప్పటి నుండి నేటి వరకు భూ ఆక్రమణదారులు తమ స్వాధీనంలో ఉన్న భూములను యంత్రలతో చదును చేసి పంటలు వేస్తున్నారని నకిలీ రికార్డులు సృష్టిస్తు భూమిని తమదిగా చేసుకుంటున్నారని రీసర్వే వారికి వరంలా మారిందని రీ సర్వే మొత్తం తప్పుల తడకగా మారిందని వారు ఆరోపించారు. ఇంకోపక్క పేదలు తమ అసైన్డ్ భూముల్లోకి వెళితే కొంతమంది అధికార పార్టీ నాయకులు వారిని భూముల్లోకి రానివ్వడం లేదని సోలార్ కంపెనీకి భూములు అమ్మమని ఒత్తిడి చేస్తున్నారని వారు తెలియజేశారు. ఎమ్మెల్యే తక్షణం స్పందించి పేదలందరికీ భూ పంపిణీ చేసే కార్యక్రమాన్ని చేపట్టాలని ఆలస్యమయ్యే కొద్దీ మండలంలో ఒక ఎకరా భూమి కూడా మిగలదని మండల ప్రజలకు ఇచ్చిన మాట తప్పిన వారవుతారని వారు తెలియజేశారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు సానా గోవిందస్వామి నాయకులు మల్లికార్జున యాదవ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు,

# టెట్ పై భయాందోళనలు వద్దు

### టెట్ కోచింగ్ లో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు

### మాదన విజయకుమార్



**బద్వేల్,జులై05.అక్షర టైమ్స్:-** ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) పై భయాందోళనలు వీడాలని యుటిఎఫ్ కడప జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం బద్వేలు లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన టెట్ ఉచిత కోచింగ్ సెంటర్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు మేరకు ఎన్సీటిఈ మార్గదర్శకాలకు అనుగుణంగా 2028 ఆగస్టు 31 లోపు ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులంతా టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించాల్సి ఉందని, దీనిపై కొందరు ఉపాధ్యాయులలో ఆందోళన నెలకొని ఉందని ఆయన పేర్కొన్నారు. విద్యాబోధన ఒకవైపు, కుటుంబ బాధ్యతలు మరొక వైపు చూస్తూ టెట్ పరీక్షకు ప్రిపేర్ కావడం ఇబ్బందికరమని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల్లో ఉన్న భయాందోళనలను పోగొట్టేందుకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని తాలూకా కేంద్రాల్లో ఉపాధ్యాయులకు ఉచిత కోచింగ్ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పాలకవర్గాలు సుప్రీంకోర్టు తీర్పును కారణంగా చూపి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష ఉత్తీర్ణతను తప్పనిసరి చేయడం సహేతుకం కాదన్నారు. బోధనలో అపార అనుభవం ఉన్న ఉపాధ్యాయులను ఇప్పుడు టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించాలనడం ఎంతవరకు సబబని వారు ప్రశ్నించారు. ఉపాధ్యాయులలో నెలకొని ఉన్న ఆందోళనను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వంతో చర్చించి విద్యాహక్కు చట్టం 23 (1) కి సవరణ చేపట్టి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ఉపశమనం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆలోపు ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు స్పెషల్ టెట్ నిర్వహించాలని కోరారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులంతా టెట్ పరీక్ష పై దృష్టి కేంద్రీకరించి, సన్నద్ధతకు సమయం వెచ్చిస్తే పాఠశాలల్లో విద్య బోధన కుంటుపడుతుందని ఆయన పేర్కొన్నారు. యుటిఎఫ్ ఒకవైపు టెట్ పరీక్ష రద్దుకు పోరాటాలు చేస్తూనే మరోవైపు, ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం ద్వారా టెట్ ఉత్తీర్ణత పొందేందుకు కృషి చేస్తున్నదని ఆయన తెలిపారు. టెట్ ఉత్తీర్ణతపై ఉపాధ్యాయులెవరూ ఆందోళనకు గురికావలసిన అవసరం లేదని, ఉపాధ్యాయులు టెట్ పాస్ అయ్యేందుకు అవసరమైన కృషిని యుటిఎఫ్ చేస్తుందని ఆయన పేర్కొన్నారు. టెట్ పరీక్ష సులభంగా పాస్ అయ్యేందుకు యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నామ మాత్రపు ఖరీదుతో పుస్తకాలు రూపొందించి అందుబాటులోకి తెచ్చామన్నారు. రాష్ట్రంలో పేరెన్నికగన్న నిపుణులైన ఫ్యాకల్టీతో కోచింగ్ నిర్వహిస్తున్నామన్నారు. అవకాశాన్ని ఉపాధ్యాయులు సద్వినియోగపరుచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.తరగతులలో టెట్ బోధకులు బి.మస్తాన్ ఖాన్ ట్రై మెథడ్స్ బోధించారు. బోధనా పద్ధతుల్లోని విధానాలను విశ్లేషణాత్మకంగా వివరించారు. టెట్ ఉత్తీర్ణత సాధించేందుకు అవసరమైన విధానాలను సులభరీతిలో బోధించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కె.సుధాకర్, ఐక్య ఉపాధ్యాయ జిల్లా కన్వీనర్ టి.శివ ప్రసాద్, అకడమిక్ సెల్ జిల్లా కన్వీనర్ వీరదాసరి క్రిస్టఫర్, సిపిఎస్ జిల్లా కన్వీనర్ ఎన్.పవన్ కుమార్, బద్వేలు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.దేవానందం, సి.కంచిరెడ్డి, ట్రెజరర్ ఎ.లాజరస్, గోపవరం మండల అధ్యక్షులు ఎస్.మస్తాన్ వలి, జిల్లా కౌన్సిల్ సభ్యులు పాలా శ్రీనివాసుల రెడ్డి, సి.హెచ్ సాగర్, తదితరులు పాల్గొన్నారు.

# జనసేన పార్టీ పదవి కోసం దరఖాస్తు చేసుకున్న రిటైర్డ్ కల్నల్ కందునూరు గోపి




**కడప,జూలై05.అక్షర టైమ్స్:-** జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పార్టీ పదవుల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ఆదివారం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా కడపలోని హరిత హోటల్ లో నిర్వహించిన కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకుడు, రిటైర్డ్ కల్నల్ కందునూరు గోపి పార్టీ పదవి కోసం తన దరఖాస్తును సమర్పించారు. జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ పార్లమెంట్ పర్యవేక్షకులు చిలకం మధుసూదన్ రెడ్డికి ఆయన దరఖాస్తును అందజేశారు. జనసేన పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలకు అనుగుణంగా ప్రజాసేవలో మరింత చురుకైన పాత్ర పోషించాలనే సంకల్పంతో ఈ దరఖాస్తు సమర్పించినట్లు కందునూరు గోపి తెలిపారు. పార్టీ బలోపేతానికి, గ్రామస్థాయి నుంచి ప్రజల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు. పార్టీ నాయకత్వం తనపై ఉంచే ఏ బాధ్యతనైనా సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, జనసేన ఆశయాల సాధనకు నిబద్ధతతో కృషి చేస్తానని ఈ సందర్భంగా కందునూరు గోపి తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు జీసి.కృష్ణమూర్తి, గోసిటి రామ గోవిందు, దాసరి రవిశంకర్, భరత్, దండు శ్రావణ్, పుల్లయ్య, విశ్వేశ్వరయ్య, దస్తగిరి, శీను తదితరులు పాల్గొన్నారు.

# సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలు డిఏస్పీ వై.శ్రీనివాస్ రావు



**రేణిగుంట,జులై 05.అక్షర టైమ్స్:-** రేణిగుంట సబ్-డివిజన్ పరిధిలో జులై 1 నుండి జులై 31 వరకు సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలు. తిరుపతి జిల్లా, రేణిగుంట సబ్-డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ మరియు ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఐపీఎస్, ఆదేశాల మేరకు, రేణిగుంట సబ్-డివిజన్ పరిధిలో 2026 జులై 1 వ తేదీ నుండి జులై నెల 31 వ తేదీ వరకు సెక్షన్ 30 పోలీస్ యాక్ట్‌కు సంబంధించిన నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని రేణిగుంట డీఎస్పీ వై. శ్రీనివాస రావు పత్రిక ప్రకటన లో తెలిపారు. ఈ సందర్భంగా రేణిగుంట డి ఏస్పీ వై. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, పోలీసు శాఖ నుండి ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు, రాస్తారోకోలు మరియు ఇతర గుంపులుగా నిర్వహించే కార్యక్రమాలు నిర్వహించరాదని సూచించారు. అలాగే రేణిగుంట సబ్-డివిజన్ పరిధిలోని రేణిగుంట, గాజులమండ్యం, ఏర్పేడు, రైల్వే కోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేల్, పుల్లంపేట మరియు పెనగలూరు పోలీస్ స్టేషన్‌ల పరిధిలో సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని తెలిపారు. అనంతరం పై నిషేధాజ్ఞలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ప్రజల శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా తీసుకున్న ఈ నిర్ణయానికి ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.


# అహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్న మచిలీపట్టణం జనసేన పార్టీ పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి ఎంపీ






**ఆళ్లగడ్డ,జులై05.అక్షర టైమ్స్:-** అహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్న నంద్యాల పార్లమెంట్ జనసేన పార్టీ పరిశీలకులు, మచిలీపట్టణం జనసేన పార్టీ పార్లమెంట్ సభ్యులు శ్రీ వల్లభనేని బాలశౌరి, ఆలయ అధికారులు, పూజారులు వల్లభనేని బాలశౌరి కి మేళాలతో స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. పూజారులు శ్రీ లక్ష్మీనరసింహస్వామి అహోబిల దేవస్థానం విశిష్టత గురించి వివరించారు, ఆనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకోవడం నా అదృష్టమని, అలాగే పవన్ కళ్యాణ్ కి ఆయురారోగ్యాలతో ఉండేలాగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆశీస్సులు కలగాలని, అలాగే కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలు కూడా సుఖ సంతోషాలతో ఉండాలని స్వామివారిని వేడుకున్నానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆళ్ళగడ్డ నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త మైలేరి మల్లయ్య, నంద్యాల నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు రాజమడుగు చందు, సుందర్, వెంకటసుబ్బయ్య, దేవా ఆంజనేయులు, మైలారు శ్రీరాములు, మెగా చైతన్య, రామస్వామి, కేశవ తదితరులు పాల్గొన్నారు.

# కలియుగ దేవుడు శ్రీనివాసుడు ఓం నమో శ్రీనివాసాయ వెంకటేశాయ







అన్నీ ప్రయత్నాలు విఫలమైపోయి, శ్వాస కూడా భారంగా అనిపించే ఆ బాధాతప్త క్షణాలలో, గుండెల నిండా బాధల సుడులు తిరుగుతున్న వేళ, లోకంలో ఏ దిక్కూ తోచనప్పుడు మన పాదాలు అప్రయత్నంగానే ఆ ఏడుకొండల వైపు సాగుతాయి. ఆ ఆనంద నిలయంలో నిలబడేది ఏదీ కోరుకోవడానికి కాదు. స్వామీ ఈ జీవిత పోరాటంలో ఇంకా నేను నిలబడగలనా అని మనల్ని మనం వెతుక్కునే ఒక ఆర్తి అది. ఒకరకంగా అది ఎందరో భక్తుల జీవితాలలో టర్నింగ్ పాయింట్ లాంటి గొప్ప సందర్భం. దానికి ఇద్దరే ప్రత్యక్ష సాక్షులు, ఒకరు మన స్వామియైన శ్రీనివాసుడు, రెండు మనము. ఎవరికీ చెప్పుకోలేని గుండెకోతను, కన్నీళ్లను లోపలే దాచుకుని ఆ దివ్య మంగళ స్వరూపం ముందు నిలబడినప్పుడు పెదవులు దాటి మాట రాకముందే కళ్లు చెమరుస్తాయి. ఆ ఒక్క క్షణ కాలపు దర్శనమే జీవిత కాలపు అలసటను, భారాలన్నింటినీ తుడిచేసే ఒక పరమాద్భుతం. ఇది కేవలం పిలిస్తే పలికే దైవం, ఆర్తత్రాణపరాయణుడైన శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధిలో మాత్రమే మనలో ఎందరికో అనేక సందర్భాలలో జరుగుతూ ఉంటుంది. సనాతన ధర్మంలో భగవంతుడిని చేరుకోవడానికి ఎన్నో మార్గాలు ప్రస్తావించబడ్డాయి. కానీ, కలియుగంలో సామాన్యుడికి సైతం మోక్షాన్ని, పరమ శాంతిని ప్రసాదించేది కేవలం 'శరణాగతి' మాత్రమే. శ్రీమద్భగవద్గీతలోని మోక్షసన్యాస యోగంలో కృష్ణ పరమాత్మ తెల్పిన సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః అనే చరమ శ్లోకానికి నిలువెత్తు సజీవమైన ప్రమాణం తిరుమల క్షేత్రం. నీ ధర్మాలు, నీ అహంకారాలు, నీ లౌకిక బంధాలన్నింటినీ నా పాదాల దగ్గర వదిలి నన్ను ఒక్కడినే పరిపూర్ణంగా శరణు వేడుకో, నిన్ను నేను చూసుకుంటాను అనే ఆ పరమాత్ముని వాగ్దానం శ్రీ వేంకటేశ్వరుని రూపంలో మనకు అభయం ఇస్తున్నది. స్వామి వారి కుడిచేయి భక్తులకు అభయాన్ని ఇస్తూ తన పాదాలను చూపిస్తుంటే, ఎడమచేయి కటి హస్తమై అంటే నడుముపై ఉండి, నన్ను శరణు వేడిన వారికి ఈ సంసార సాగరం కేవలం మోకాలి లోతు మాత్రమే అని ప్రతి భక్తునికి తరుణోపాయాన్ని సూచిస్తూ మనలను కార్యోన్ముఖులుగా అనుగ్రహిస్తూంటాడు. శ్రీవారంటే మన కంటికి కనిపించే సాక్షాత్తు పరమాత్ముని లీలామయ అర్చారూపం. కంటికి కనిపించని ఆ పరబ్రహ్మం, తన పరత్వమనే అగోచర స్థితిని వీడి, భక్తుడు సమర్పించే అభిషేకాలకు, అలంకారాలకు, వారి నిష్కల్మషమైన ప్రార్థనలకు లొంగిపోయే ప్రత్యక్ష దైవంగా తిరుమలలో వెలిశాడు. స్వామి వారి ఈ భక్తసులభ తత్వాన్ని, అపారమైన కరుణను శ్రీ నిగమాంత మహాదేశికులు తమ దయాశతకం లో అద్భుతంగా ఆవిష్కరించారు. ఆయన దయాగుణాన్ని ఒక దైవంగా భావిస్తూ, ప్రపద్యే తం గిరిం ప్రాయః శ్రీనివాసానుకంపయా ఇక్షుసారస్రవంత్యేవ యన్మూర్త్యా శర్కరాయితం అంటూ స్తుతించారు. చెరకు గడ పైకి నల్లగా, గట్టిగా కనిపించినా లోపల తీపి రసాన్ని ఎలా దాచుకుంటుందో, అలాగే వేంకటాద్రి కొండపై కొలువుదీరిన ఆ నీలమేఘ శ్యాముడు పైకి గంభీరమైన అర్చారూపంలో నిశ్చలంగా కనిపించినా, లోపల అనంతమైన దయామృత ప్రవాహాన్ని దాచుకున్నాడని దీని భావం. స్వామి వారి దయ ఎంత గొప్పదో దయాశతకంలోని మరొక శ్లోకం అద్భుతంగా వివరిస్తుంది అపి జగతి జంతూనాం వ్యసనాభిభవాద్ భవత్యనుకంపే తిరువేంకటశైలేంద్రస్య కరుణే త్వం తాపత్రయప్రతిపక్షా అంటే, ఈ సంసార చక్రంలో నలిగిపోతూ, తాపత్రయాలతో అలసిపోయిన జీవులను చూడగానే వేంకటేశ్వరుని హృదయం ద్రవించిపోతుంది. ఆయన కరుణ ఆ తాపత్రయాలన్నింటినీ సమూలంగా నాశనం చేసి, భక్తునికి శాంతిని ప్రసాదించింది. అర్చారూపంలో ఉన్న స్వామి భక్తుల ఆర్తిని చూసి కరిగిపోయే గుణాన్ని వేదాంత దేశికులు ఇందులో పరమాద్భుతంగా వర్ణించారు. స్వామి వారి ఈ దయామయ హృదయాన్ని, అర్చారూప సౌందర్యాన్ని ఆళ్వారులు తమ పాశురాలలో అమృతంలా కీర్తించారు. శ్రీ కులశేఖర ఆళ్వార్లు పెరుమాళ్ తిరుమొళిలో స్వామి వారి కరుణను ఆకాంక్షిస్తూ చేసిన మంగళాశాసనం భక్తుల హృదలయాలను కదిలిస్తుంది ఆనద సెల్వత్తు అరంభైయర్గళ్ త్రొళు దెళుమ్ వానదమ్మాళ్ శెల్వ మురసిల్ నిన్ నిస్తురుళుమ్ వేనల్ నెడుంగణ్ పిరైయెయిఱ్ఱు వేళత్తె మాన వముక్కు విత్తా నరై వేంకడత్తు ఆనైయుం ఆవాన్ నిన్ను అడియెన్ ఉయ్ వేనే ఈ భూమిపై ఉండే భోగభాగ్యాలు గానీ, స్వర్గలోక సుఖాలు గానీ నాకు వద్దు స్వామీ నీ అర్చారూపం కొలువై ఉన్న ఆ తిరుమల కొండపై ఒక చిన్న పక్షిగానో, అడవిలో ఒక చెట్టుగానో, లేదా నీ గర్భగుడి వాకిలి ముందర ఒక పడిగా పడి ఉండే భాగ్యాన్ని ఇవ్వు, నీ భక్తుల పాదధూళి నాపై పడితే చాలు, నా జన్మ ధన్యమౌతుంది అని ఆళ్వార్లు స్వామి దయను వేడుకుంటారు. అలాగే శ్రీ నమ్మాళ్వార్లు తమ తిరువాయిమొళిలో స్వామి వారి ఆశ్రిత వాత్సల్యాన్ని కొనియాడుతూ. అగల గిల్లేన్ ఇఱైయుమ్ ఎన్రు అలర్ మేల్ మంగై ఉఱై మార్బా నిగరిల్ పుహళాయ్ ఉలహమ్ మూన్రుడైయాయ్ ఎన్నై ఆళ్వానై నిగరిల్ అమరర్ మునిక్కణంగళ్ విరుంబుమ్ తిరువేంకడత్తానే పుహలొన్రిల్లా అడియేన్ ఉన్ అడిక్కీళ్ అమరందు పుగుందేనే అని కీర్తించారు. స్వామి వక్షఃస్థలంలో నిరంతరం నివసించే అలమేలుమంగమ్మ సమేతుడైన ఓ వేంకటేశ్వరా, మునులకు, దేవతలకు సైతం లభించని నీ అర్చారూప దర్శన భాగ్యం నాకు ప్రసాదించావు. లోకంలో ఏ దిక్కూ లేని అల్పుడనైన నేను, నీ దయను నమ్ముకుని నీ దివ్య చరణాల చెంత శరణు వేడుతున్నాను అని శరణాగతి చేశారు. గంటల తరబడి క్యూలైన్లలో నిలబడి, అలసిపోయి, జరిగండి. జరుగండి. అనే పిలుపుల మధ్య ఆ గర్భగుడి ముందరకు రాగానే కాలం ఒక్కసారిగా స్తంభించిపోతుంది. ఆ అఖండ జ్యోతుల వెలుగులో, శంఖ చక్రధారియైన ఆ శ్రీవారి అర్చారూపం కళ్లముందు కదలాడగానే లోకంలోని బాధలన్నీ మంచులా కరిగిపోతాయి. పెదవులు మూసుకున్నా హృదయం స్వామితో మాట్లాడుతుంది. స్వామి ముఖారవిందంలోని ఆ మందహాసం నేనున్నాను కదా, నీకెందుకు దిగులు అని ఓదారుస్తున్నట్లు అనిపిస్తుంది. శ్వాస భారమైన ప్రతిసారీ, జీవితంపై విరక్తి కలిగిన ప్రతిసారీ ఒక్కసారి గుండెపై చేయి వేసుకుని గోవిందా అని తలచుకుంటే చాలు, ఆ నామస్మరణలోనే ఒక అలౌకికమైన ధైర్యం పుడుతుంది. శ్రీవారంటే కోట్లాది మంది నమ్మకం, నిశ్శబ్ద రోదనలను విని సరైన పరిష్కారాన్ని ప్రసాదించే ఏకైక పరమాశ్రయం. దయాశతకంలో చెప్పబడినట్లు ఆయన 'కరుణా పయోనిధి'. మనం ఏమీ అడగనక్కర్లేదు, మన కంటి తడిని చూసి మనకు ఏం కావాలో గ్రహించే పరమదయాళువు ఆయన. అందుకే, ఎవరికీ చెప్పుకోలేని బాధలను ఆ శ్రీనివాసుని పాదాల చెంత పెట్టేయండి. ఆ ఒక్క క్షణ దర్శన భాగ్యం, ఆ దివ్య నామస్మరణ మన జీవితాంతం మనల్ని నీడలా నడిపించే ఒక మహా శక్తిగా మారుతుంది. ఓం నమో వేంకటేశాయ అని అక్షర టైమ్స్ దినపత్రిక ద్వారా మీకు తెలియచేయుచున్న అర్చకం రామకృష్ణ దీక్షితు మరియు రైల్వే కోడూరు నియోజకవర్గం పద్మశాలి సంఘం అధ్యక్షులు మరియు పుల్లంపేట మండలం టీడీపీ నాయకులు దొంతు శివయ్య

# కెవీఆర్ ఆస్పత్రిలో నూతన వైద్య విభాగాల ప్రారంభం



**నంద్యాల,జులై05.అక్షర టైమ్స్:-** నంద్యాల సంజీవనగర్‌లోని కెవీఆర్ ఆస్పత్రిలో న్యూరాలజీ, నియోనేటల్, పీడియాట్రిక్ క్రిటికల్ కేర్ విభాగాలను ఆదివారం ప్రారంభించారు. ఐఎంఏ జాతీయ కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవి కృష్ణ ప్రారంభోత్సవం నిర్వహించారు. డాక్టర్ సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ విభాగాల్లో డాక్టర్ జయ రామకృష్ణ నేతృత్వంలో ఇంటర్వెన్షనల్ న్యూరాలజీ సెంటర్, డాక్టర్ నిత్య ఆధ్వర్యంలో నవజాత శిశువులు, చిన్నారుల క్రిటికల్ కేర్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ నంద్యాలలోనే సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి రావడం అభినందనీయమన్నారు. డాక్టర్ జయ రామకృష్ణ, డాక్టర్ నిత్య మాట్లాడుతూ అత్యాధునిక పరికరాలతో పక్షవాతం బాధితులు, నవజాత శిశువులు, చిన్నారులకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు పాల్గొన్నారుద

# విద్యే దేశ అభివృద్ధికి పునాది

### విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేసిన మానవ హక్కుల పరిరక్షణ సంస్థ






**ఆదోని,జూలై05.అక్షర టైమ్స్:-** ఆదోని పట్టణంలోని 16వ వార్డు రాయ నగర్ లో మానవ హక్కుల పరిరక్షణ సంస్థ ఆధ్వర్యంలో వందమంది పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్సిల్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మానవ హక్కుల సంస్థ అధ్యక్షుడు సురేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు విద్యా సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడుతూ విద్యే దేశ అభివృద్ధికి బలమైన పునాది అని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నంత లక్ష్యాలతో చదువుకొని సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఆర్థికంగా వెనకబడిన విద్యార్థులకు విద్య పరంగా అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. సిద్ధపరంగా ప్రోత్సాహం అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు.విద్యార్థులకు అవసరమైన విద్యాసామాగ్రిని అందించిన మానవ హక్కుల పరిరక్షణ సంస్థకు కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థిలు, విద్యార్థితల్లిదండ్రులు.ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు జయరాం, గోవిందు, శాంతమ్మ స్థానికులు తల్లిదండ్రులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# డీఎస్పీ నూతన గృహప్రవేశంలో పాల్గొన్న డిసిసిబి చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి



**బద్వేల్,జులై05.అక్షర టైమ్స్:-** కడప జిల్లా చెన్నూరు మండలం చిన్నమాచుపల్లి గ్రామంలోని ద్వారకా టౌన్‌షిప్‌లో మైదుకూరు డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్ నూతన గృహ కార్యక్రమంలో ఆదివారం ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన గృహాన్ని సందర్శించిన మంచూరు సూర్యనారాయణ రెడ్డి డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్ , వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి, నూతన గృహంలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం నిత్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో శ్రీ వెంకటేశ్వర స్వామివారి ప్రాకారోత్సవం





**వేంపల్లె, జూలై 05. అక్షర టైమ్స్:-** స్థానిక శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి ప్రాకారోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించినట్లు ఆలయ ఈఓ సుభాష్, పాలకమండలి చైర్మన్ పీవీ రమణ లు తెలిపారు. ఆలయ ముఖ్య అర్చకులు హరిప్రవీణ్, తిరుమల వేణు స్వాముల ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్లను పల్లకిపై కొలువుదీర్చి ఆస్థాన పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు పల్లకిని భుజాలపై మోసుకుంటూ అర్చకుల వేదమంత్రోచ్చారణ, మంగళవాయిద్యాలు, మహిళల కోలాటాల నడుమ ఆలయ గర్భగుడి చుట్టూ ప్రాకారోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాత్కాలిక ఉభయదారులు ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఆలయ అధికారులు వారిని సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు వరాలు, రెడ్డయ్య, ఆలయ సిబ్బంది సుధాకర్, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# నేడు జిల్లా వ్యాప్తంగా ప్రజా సమస్యల స్వీకరణ

### ఉదయం 9.30 నుంచి కలెక్టరేట్‌తో పాటు అన్ని డివిజన్, మండల, మున్సిపల్ కార్యాలయాల్లో నిర్వహణ ప్రజలు వినతులు సమర్పించాలని కలెక్టర్ జి.రాజకుమారి పిలుపు



**నంద్యాల,జులై05.అక్షర టైమ్స్:-** జిల్లా ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించి ప్రభుత్వ సేవలను మరింత సమర్థవంతంగా అందించాలనే లక్ష్యంతో సోమవారం (జూలై 6) జిల్లా వ్యాప్తంగా 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌తో పాటు అన్ని రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, మండల పరిషత్ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో ఒకేసారి ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించి సంబంధిత శాఖల అధికారుల ద్వారా పరిశీలించి పరిష్కార చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను నేరుగా అధికారులకు సమర్పించవచ్చని, అలాగే meekosam.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా ఫిర్యాదులు నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. సమర్పించిన అర్జీల పరిష్కార స్థితిని అదే వెబ్‌సైట్‌లో లేదా 1100 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా తెలుసుకోవచ్చని వివరించారు. అర్జీదారులు ముందుగా తమ సమస్యలను మండల, రెవెన్యూ డివిజన్ లేదా మున్సిపల్ స్థాయిలో సమర్పించి, అక్కడ పరిష్కారం కాని అంశాలను మాత్రమే జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల వినతులను స్వీకరించి, వాటిపై వెంటనే స్పందించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ జి. రాజకుమారి గణియా అధికారులను ఆదేశించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# సంజీవ నగర్ కోదండ రామాలయంలో నూతన షెడ్డు నిర్మాణానికి 5,50,000వేల రూపాల ఆర్థిక సహకారం అందించారు గోళ్ళ రాజేష్

### పూర్ణకుంభంతో గోళ్ళ రాజేష్ కు ఘన స్వాగతం పలికిన శ్రీ భగవత్ సేవా సమాజ్ పాలక కమిటీ సభ్యులు..

### కలియుగ వరదుడు శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలోని ప్రాంగణంలో గోళ్ళ రాజేష్ కు ఘన సత్కారం

### గోళ్ళ రాజేష్ కు పవిత్ర మంత్రోచ్ఛారణలతో ప్రత్యేక ఆశీర్వచనాలు అందించిన అర్చకులు

### స్వామి వారి తీర్థ ప్రసాదాలతో పాటు స్వామి వారి చిత్రం పటము,శేష వస్త్రాలను గోళ్ళ రాజేష్ కు అందించారు అర్చక స్వాములు





**నంద్యాల,జులై05.అక్షర టైమ్స్:-** పట్టణంలోని స్థానిక సంజీవ్ నగర్ లో వెలసిన శ్రీ కోదండ రామాలయం దేవస్థానం నందు భక్తుల సౌకర్యార్థం, వాతావరణ మార్పులతో ఇబ్బంది కలగకుండా ఉండాలని మన ఓపెన్ గ్రౌండ్ కు నూతన శాశ్వత షెడ్డు నిర్మాణానికి తన వంతు సహాయంగా 5,50,000వేల రూపాయల ఆర్థిక సహకారాలు అందించారు నంద్యాల వాసి ప్రముఖ వ్యాపారవేత్త సామాజిక సేవకులు గోళ్ళ రాజేష్,ఈ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక అతిథిగా విచ్చేసిన గోళ్ళ రాజేష్ కు దేవస్థాన శ్రీ భగవత్ సేవా సమాజ్ పాలకమండలి కమిటీ సభ్యులు గోళ్ళ రాజేష్ కు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు.వేద మంత్రోచ్ఛారణలతో శుభకరంగా అర్చక స్వాములు మేళాలతో దేవస్థాన ఆలయంలోనికి స్వాగతించారు. "భూమి పూజకు" విచ్చేసిన భూరి విరాళ దాత, ఆపద్బాంవుడిగా ప్రజలకు మేలు చేసే పలు కార్యక్రమాల రూపశిల్పి నంద్యాల వాసి ప్రముఖ పారిశ్రామికవేత్త గోళ్ళ రాజేష్ కి శ్రీ భగవత్ సేవా సమాజ్ పాలకవర్గ సభ్యుల హృదయపూర్వక ఆత్మీయ స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో ముందుగా గణపతి ప్రార్థన నిర్వహించి షెడ్డు నిర్మానం చేపట్టనున్న సందర్భంగా భూమి పూజ పంచలోహ, నవరత్న సమర్పణలతో అర్చకులు మంత్రోచ్ఛారణలతో శుభకరంగా నిర్వహించారు.అదేవిధంగా దేవస్థానం నందు ప్రతి శనివారం జరిగే శ్రీ వినాయక, శ్రీ సుదర్శన, శ్రీ ధన్వంతరి హోమంలో గోళ్ళ రాజేష్ ప్రత్యేకంగా పాల్గొన్నారు.అనంతరం కలియుగ వరదుడైన ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి విశేష అర్చనలతో పాటు మహా మంగళ నీరాజనం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అశేష భక్త జనసదోహం మద్యలో గోళ్ళ రాజేష్ ని దేవస్థాన పాలకవర్గ సభ్యులు ప్రత్యేక పూల మాల, స్వామి వారి శేష వస్త్రంతో పాటు కిరీట దారణను నిర్వహించి ఆ దేవదేవుని ఆశీస్సులు గోళ్ళ రాజేష్ కి ఎల్లవేళలా ఉండాలని పాలకవర్గం వారు ఆకాంక్షిస్తూ ఘనమైన సత్కారాన్ని ఏర్పాటు చేసి గోళ్ళ రాజేష్ పై ఉన్న వారి ప్రేమాభిమానాలను తెలిపారు.

# ప్రజల కోసం మీ పార్థసారథి : ప్రజలతో ముఖాముఖి

### ప్రజల వినతులను స్వీకరించి అధికారులకు ఆదేశాలు..

### అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తామని హామీ





**ఆదోని,జూలై05.అక్షర టైమ్స్:-** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న "ప్రజల కోసం... మీ పార్థసారథి" కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం పట్టణంలోని 19వ వార్డు మండిగిరి ప్రాంతంలో పర్యటించారు. సుంకులమ్మ అవ్వ దేవాలయం నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 19వ వార్డులో అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయని ఎమ్మెల్యేకు తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు హౌసింగ్ పథకం ద్వారా ఇళ్ల నిర్మాణానికి సహాయం అందడం, రేషన్ కార్డులు, ఆదాయ--కుల ధ్రువీకరణ పత్రాలు, కుటుంబ సభ్యుల మార్పులు, జనన ధ్రువీకరణ పత్రాలు త్వరితగతిన మంజూరు కావడం, పీఎంఏవై హౌసింగ్ సైట్లు, రెండు ఫేజ్ విద్యుత్ కనెక్షన్లు, దివ్యాంగులకు బ్యాటరీ ట్రైసైకిళ్లు, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, "తల్లికి వందనం" వంటి సంక్షేమ పథకాల అమలుతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని పేర్కొన్నారు. ప్రతి నెల సామాజిక భద్రతా పెన్షన్లు సకాలంలో అందుతున్నాయని, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం ఎంతో ఉపయోగకరంగా ఉందని చెబుతూ కూటమి ప్రభుత్వానికి, ఎమ్మెల్యే డా. పీవీ పార్థసారథి వాల్మీకి గారికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వార్డులో ఇంకా పరిష్కారం కావాల్సిన సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా హౌసింగ్ స్కీమ్ కింద పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణ బిల్లులు మంజూరు చేయాలని, డివైడర్ నగర్ ప్రాంతంలో తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని, ఆర్టీసీ కాలనీలో లో-వోల్టేజ్ సమస్యను పరిష్కరించి అధిక సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ఇండోర్ స్టేడియం నిర్మాణం, ఆర్టీసీ కాలనీలో ఖాళీ స్థలాల అభివృద్ధి, సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణం, పారిశుధ్య నిర్వహణ మెరుగుదల, ప్రజా మరుగుదొడ్ల ఏర్పాటు, పోలీస్ బీట్ ఏర్పాటు, మండిగిరి ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాల్, పార్కులు, ఓపెన్ జిమ్, కొత్త విద్యుత్ స్తంభాలు, ఎల్ఈడీ వీధి దీపాలు, పాఠశాల సమీపంలో మినీ వాటర్ ట్యాంక్ ఏర్పాటు వంటి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల వినతులపై స్పందించిన ఎమ్మెల్యే డా. పీవీ పార్థసారథి వాల్మీకి సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రాధాన్యత ఆధారంగా దశలవారీగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్నామని, అభివృద్ధి--సంక్షేమం రెండింటినీ సమన్వయంతో ముందుకు తీసుకెళ్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ 19వ వార్డు ఇన్‌చార్జి కె. శ్రీనివాస ఆచారి, చంద్ భాషా, జనసేన నాయకులు మంజు, విశ్వనాథ్, బీజేపీ నాయకులు హనుమంతు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు, పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# గండి శ్రీ వీరాంజనేయ స్వామివారిని దర్శించుకున్న తాళ్లపాక హరి నారాయణ స్వామీజీ

**చక్రాయపేట,జూలై05.అక్షర టైమ్స్:-** గండి క్షేత్రం శ్రీ వీరాంజనేయ స్వామివారిని తాళ్లపాక అన్నమాచార్యుల 12వ తరం వారసులు తాళ్లపాక హరి నారాయణ స్వామీజీ గురుదంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు కేసరి స్వామి, ఉప ప్రధాన అర్చకులు రాజా స్వామి, ఆలయ పాలకమండలి చైర్మన్ వెంకటస్వామి లు ఆలయ మర్యాదలతో, వేద మంత్రోచ్ఛారణ, కోలాటంతో స్వాగతం పలికారు. దర్శనానంతరం హరి నారాయణ స్వామీజీ భక్తులను ఉద్దేశించి అన్నమయ్య సంకీర్తనల విశిష్టత, శ్రీ వెంకటేశ్వర స్వామి లీలలు, గండి శ్రీ వీరాంజనేయ స్వామివారి చరిత్ర, క్షేత్ర మహిమను సంక్షిప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ కోఆర్డినేటర్ రమాదేవి, వారి బృందం, శ్రీ సప్తగిరి గోవిందమాల సభ్యులు, సేవాసమితి అధ్యక్షులు మల్లెల రామానుజులు, వారి బృందం, తదితరులు పాల్గొన్నారు.

# సుంకాలతో వస్త్ర పరిశ్రమ కుదేలు!



డొనాల్డ్ ట్రంప్ సర్కార్ విధించిన సుంకాలు భారతీయ వస్త్ర పరిశ్రమ, ఎగుమతిదారులపై తీవ్రంగా పడింది. తమ ఆదాయం సగానికి పడిపోయినట్టు 34 శాతం వ్యాపార సంస్థలు నివేదించాయి. ఈ మేరకు కాన్ఫెడరేషన్‌ఆఫ్ ఇండియన్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ (సీఐటీఐ) నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. భారత వస్త్ర ఎగుమతుల కు అతిపెద్ద మార్కెట్ అమెరికా. మన దేశ మొత్తం వస్త్ర ఎగుమతుల్లో అమెరికా వాటా 10.8 బిలియన్ డాలర్లు కావడం గమనార్హం. భారత వస్త్ర ఎగుమతుల్లో ఇది సుమారు 30 శాతం. భారత ఎగుమతులపై ట్రంప్ సర్కార్ 25 శాతం అదనపు సుంకం, 25 శాతం జరిమానా, మొత్తంగా 50 శాతం సుంకం విధించింది. ఇది మన వస్త్ర ఎగుమతులను తీవ్రంగా దెబ్బతీసింది. సెప్టెంబర్-అక్టోబర్ నెలల్లో 60 అగ్ర వస్త్ర ఎగుమతిదారులు, పరిశ్రమల సంఘాలతో మాట్లాడి సీఐటీఐ ఈ నివేదికను విడుదల చేసింది. పోటీని తట్టుకుని నిలబడటానికి 25 శాతం వరకు డిస్కౌంట్లు ఇస్తున్నట్టు 67 శాతం ఎగుమతిదారులు తెలిపారు. ఈ క్రమంలో నష్టాలను భరించాల్సి వస్తున్నదని సీఐటీఐ సెక్రెటరీ జనరల్ చంద్రిమా ఛటర్జీ పేర్కొన్నారు. 'వస్త్ర పరిశ్రమ స్వల్ప మార్జిన్ కలిగిన వ్యాపారం. అయినప్పటికీ, వినియోగదారులను పోగొట్టుకోకుండా ఉండేందుకు చాలా కంపెనీలు డిస్కౌంట్లు ఇస్తూ నష్టాలను భరిస్తున్నాయి. అమెరికాతో చర్చలు జరుగుతున్న నేపథ్యంలో ఏదైనా ఉపశమనం కలుగుతుందని వస్త్ర పరిశ్రమలు ఆశిస్తున్నాయి' అని ఛటర్జీ పేర్కొన్నారు. భారతదేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో 2.3 శాతం వాటా కలిగిన, 4.5 కోట్ల మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న వస్త్ర పరిశ్రమలు పెట్టుబడుల ప్రవాహం మందగించడం సహా అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. దానికితోడు సుంకాల ప్రభావంతో అమ్మకాలు తగ్గిపోయి, ఆదాయాలు పడిపోయినట్టు భారతీయ వ్యాపారులు చెప్తున్నారు. అమెరికన్ల నుంచి డిస్కౌంట్ల కోసం అభ్యర్థనలు (30 శాతం), ఆర్డర్లను రద్దు చేయడం లేదా వాయిదా వేయడం (25 శాతం), ఆర్డర్ మొత్తంలో కోత (20 శాతం) తదితర కారణాల వల్ల ఆదాయాలు గణనీయంగా పడిపోయినట్టు పేర్కొంటున్నారు. ఆర్డర్ల మందగమనం కారణంగా గోదాంలలో స్టాక్ పేరుకుపోయి 85 శాతం కంటే ఎక్కువ మంది భారతీయ ఎగుమతిదారులు సతమతమవుతున్నారు. గతేడాది సెప్టెంబర్‌తో పోలిస్తే 2025 సెప్టెంబర్‌లో వస్త్రాల ఎగుమతులు 10.34 శాతం తగ్గడం ఏ మాత్రం ఆశ్చర్యపరచలేదు. తత్ఫలితంగా చాలా మంది ఎగుమతిదారులు, ముఖ్యంగా ఎంఎస్ఎంఈలు (సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు) తీవ్రమైన మూలధన వ్యయం కొరతను ఎదుర్కొంటున్నాయి.